

# శిలాప్రతిమలు

అంగర వెంకటకృష్ణారావు

బండిలో ప్రయాణం చేస్తున్నంతసేపూ చిత్రకారుడి హృదయంలో ఆనందం ఆత్రుత వుప్పొంగుతున్నాయి. రెండేళ్లు బహు దూరప్రదేశంలో ఉన్నత విద్యాభ్యసనానికి వున్న కూతురు నేడు తిరిగి యిల్లు చేరుకుంటూంది.

ఆమె ప్రశ్న పరంపరలు కురిపిస్తూంది. అతడేవో సమాధానాలు చెపుతున్నాడు. కాని రైలు దిగుతూనే, ఢిల్లీలో పోటీకి తను పంపనున్న చిత్రాన్నిగురించి చెప్పాడు.

'తల్లీ- అది నీ రాకకోసమే యిన్నిరోజులై పంపకుండా వుంచాను. ,ఇంకా వారం రోజులు వ్యవధి వుంది.'

ఆమె గర్వంగా నవ్వింది.

ఆమె గర్వానికి కారణం తన వున్నత విద్య కాదు-దానిచేత సులభీకరించబడిన తన సౌందర్యం కాదు. తండ్రి కళాతపస్వి-అతడి ప్రతిభ ఆమె యిదివరకే గ్రహించింది.

పాలలో నిండుచందురుని బింబంవలె వెన్నెల నాటిరేయి తాజ్‌మహల్ శోభ, సాత్పూరాపర్వత శిఖరాగ్ర మీద కళ్లు మిరుమిట్లు గొలిపే యావనార్కకిరణరామణీయకత - దానిక్రింద అగాధములైన లోయలలో మఖమలువంటి లేతపచ్చిక మేసే మేకపిల్లల మెడలలోని చిరుమువ్వల గంటల లింగులింగులో ప్రతిధ్వనించే ప్రకృతి రహస్య మంత్రరవళి- ఇవన్నీ తనకు అనుభవైకవేద్యాలు- ఇంకా యింకా యెన్నో !

ఇల్లు కదలకుండా, నిశితమైన ఊహజ్ఞాశక్తివల్ల- నిశ్చలమైన మనోకేంద్రీకరణంవల్ల- తను చూచి చెప్పలేని విషయాలుకూడా చూడకుండా చిత్రించే కళాతపస్వి తండ్రి. తన ఆమోదంకోసం పోటీ చిత్రాన్ని ఢిల్లీ పంపకుండా అట్టే పెట్టాడు. అదే ఆమెకు గర్వకారణం !

ఇల్లు చేరుకోగానే స్నానంచేసి—అస్తాచలం మీంచి పండు బాదమాకు రంగులు చిందుతూన్న సూర్యబింబాన్ని కాదనే కపోలయుగళిపై మంద హాసరేఖతో భోజనశాల ప్రవేశించింది ఆమె, తండ్రితో.

ఆమె ఎన్నో విషయాలు చెపుతూంది- ప్రకృతి పులకరించి నవ్విన నవ్వులో విజృంభించిన తూర్పు బెంగాలు నిమ్నోన్నత ప్రదేశాలు—పనస అనాస తోటలలో రంగు రంగుల పిట్టల మధురకూజితాలు.

అతడు వింటున్నాడు- కాని మనస్సంతా తన చిత్రంమీదవుంది—అది తన తపస్సంతా ధారపోసి వ్రాసిన చిత్రం- పోటీకి పంపబోతూన్న చిత్రం- వైదుష్యం- అనుభవం- యావనం- సౌందర్యం- ప్రాజ్ఞత చరమస్థితిలో మూర్తీభవించిన తన ఏకైక సంతానంచూసి పొగడినప్పుడు- తన నిట్టూర్పులో చందన పరిమళం- తన శ్రమజలకణంలో రోజా అత్తరు గ్రహిద్దామని అతని ఆశ.

'రా తల్లీ- చిత్రాన్ని చూతువుగాని' అని ఆమె చేయి పట్టుకుని ఆశ్రమంలోని తీసుకువెళ్లాడు.

కళాతపస్వి- 'ఆశ్రమం' అని ఆ గదికి పేరు పెట్టాడు. దానిలో పూర్తిఅయిన చిత్రాలు రమణీయంగా గోడలకు అమర్చివున్నాయి- పూర్తి కానివి 'ఫ్రేమ్'లలో అమర్చబడి 'స్టాండ్'లమీద వున్నాయి- రంగులు, కుంచెలు మొదలైనవి అక్క-

దక్కడ పడివున్నాయి- ఆశ్రమద్వారానికి ఎదురు గోడని ఆనుకుని ఒకచిన్న బల్లమీద అనావిష్కృత చిత్రం ఒకటివుంది.

దానిని చూపించడానికే- దానికి మెప్పులు పొందడానికే-పోటీలో దానివల్ల ప్రథమ బహుమానం పొందడానికే యింత వుబలాటం అతనికి.

ఎడమచేతితో తప్తరజతంవంటి పండుగడ్డం సవరించుకుంటూ -సంతోషంచేత లోచనాంతాలు రక్తిమ వహించి- బోసినోరు కనుపించేలా నవ్వుకుంటూ- కుడిచేత్తో పైతెర తొలగించి, కూతురు వేపు సాభిలాషగా, సాభిప్రాయంగా, సగర్వంగా చూశాడు.

ఆమె మొదట పులిని చూసిన లేడివలె వెనుకంజవేసి-పిదప నీలాకాశంలో తూలికా పరంపరవంటి మేఘశకలాలు పరుగెత్తినప్పుడు వలె ముఖవైవర్ణ్యం పొందగా-చివరకు నిశ్చేష్ట అయింది.

'తండ్రీ!' అని వెనక్కితిరిగి ఆశ్రమం అవతలకి-వెళ్ళిపోయింది.

అతడి వృద్ధ హృదయంలో బల్లెం గుచ్చుకుంది. తన జీవిత తపఃఫలితంగా-తన మస్తిష్కాన్ని భేదించుకు పుట్టిన ఈ చిత్రకళా విలాసినిని చూసి మచ్చరించుకుందా కూతురు?

అతడికి రాత్రి నిద్రపట్టలేదు-తిరిగి కూతురు ముఖం చూడలేక పోయాడు. ఉదయార్కుడి కరుణ కిరణాలు ముఖంమీద గుచ్చుకునేవరకూ అతనికి తెలివి రాలేదు.

తెలివివచ్చి లేచి బద్ధకంగా విరుచుకునే సమయానికి ఏదో కాలికింద రెపరెపలాడింది. అది తీసి చదువుకున్నాడు.

"తండ్రీ ! నీతో ముఖాముఖిని చెప్పలేక వ్రాయవలసి వచ్చింది. క్షమించు. నీ చిత్రంలో కళాకల్పవల్లి శతసహస్రకుసుమాలు వికసించింది. కాని వాటిమధ్య సత్యమైన మానవజీవితం, ఎముకలు పటపట విరిగి, రోదిస్తూంది. నీ చిత్రంలో కళాకుసుమపరిమళాలు గుబాళిస్తున్నాయి. కానీ వాటినడుమ దీర్ఘనిశ్వాసాలు వినిపిస్తున్నాయి- నీ చిత్రంలోవున్నట్టు మహాత్ముడు మందహాసారోహణంచేసి, దేవదుందుభులతో, దేవతలనడుమ స్వర్గపురి చేరలేదు. తోడిమానవులకోసం జీవితాన్ని ధారపోసిన, అతీతమైన శక్తులుగల ఒక మానవుడి నిర్యాణసన్నివేశాన్ని సత్యదూరంగా నిరూపించి, అతడికి సంభావిత దివ్యత్వం ఆపాదించి, విశాలమైన మానవహృదయాన్ని సంకుచితపరిచావు.

"నీచిత్రం ప్రథమబహుమతి పొందుతుందనుకో- కొన్నివందల సంవత్సరాలు గడిచాక గతాన్ని పరిశోధించే మానవసమాజంలో పడి యీ చిత్రాంతర విశ్వదాత, ఆదర్శమానవుడు తన నిసర్గ జీవితచరిత్రని కోలుపోయి- అసత్యాంధకారపు గర్భగుడిలో గడ్డకట్టుకొని శిలాప్రతిమ అయిపోతాడు- తండ్రీ యిది నిజం ! భూతకాలపు చీకటిలోకి సత్యకిరణ ప్రసారంచేసిచూస్తే ఎన్నెన్ని శిలాప్రతిమలు కాళ్ళతో నడుస్తూ గోచరిస్తాయో !"

'అమ్మాయీ' అనిఆశ్రమంలోంచి కేకపెట్టాడు.

ఆవిష్కరింపబడిన చిత్రంపై వెర్రిగా జల్లిన నల్లరంగు మరకలుచూసి, ఉబికుబికి వచ్చే దుఃఖతరంగాలో అన్నట్టు, కన్నీళ్ళు కారుస్తూ అతడిని దగ్గరి, 'క్షమించు తండ్రీ' అని ఒడిలో తల గుచ్చి బిగ్గరగా ఏడ్చింది.

ఆమెవీపుపై కూడా రెండుమూడు వెచ్చ వెచ్చటి కన్నీటిచుక్కలు పడ్డాయి.


# ది ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్డాఫీసు : మదరాసు

(Estd·  1907

జారీచేసి చందావేయబడిన

| | | |
|---|---|---|
| మూలధనం | రూ. | 72,00,000 |
| అడిగిన మూలధనము. | రూ. | 53,00,000 |
| రిజర్వ్ ఫండ్ | రూ. | 62,00,000 |

అన్నిరకాల బ్యాంకింగ్

వ్యవహారాలు చేయబడును.

యన్. గోపాల అయ్యర్,

కార్యదర్శి.